క్లుప్తంగా

పర్యావరణ సహితంగా దీపావళిని జరుపుకోండి

• ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు: దీపావళి పండగను ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలు పూర్తిగా అస్వాదించేందుకు పర్యావరణ హితంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆకాంక్షించారు. నరకాసురుడి పీడను శక్తి స్వరూపిణి సత్యభామ వధించి లోకానికి ఆనంద వెలుగులు నింపిన స్త్రీ శక్తికి ప్రతీకగా దీపావళి పండగ జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. సంప్రదాయబద్ధంగా దీపాలు వెలిగించి, పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సంతోషకరమైన, ప్రమాద రహిత, ఆరోగ్యవంతమైన దీపావళిని జరుపుకోవాలని కోరారు.

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ చైర్మన్‌కు రూ.లక్ష విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి

మర్రిపాడు: మండలంలోని పెగళ్లపాడులో పోలేరమ్మ దేవాలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. పెగళ్లపాడు గ్రామస్తులు పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని కృష్ణప్రసాద్‌రెడ్డిని కోరడంతో శుక్రవారం రాత్రి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా పల్లె నిద్రకు పెగళ్లపాడు గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆలయ నిర్మాణం కోసం రూ.లక్షను ఆలయ కమిటీ చైర్మన్‌కు అందజేశారు.

ఘనంగా మౌలానా జయంతి



మౌలానా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి దివంగత మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఆత్మకూరు అగ్నిమాపక కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఫైర్ అధికారి రమేష్‌బాబు ఆధ్వర్యంలో అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి సిబ్బంది ఘన నివాళి అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



శాంతినగరం కాలనీలో దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణానికి చెందిన ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పలు గిరిజన కాలనీల్లో పేదలకు దుప్పట్లు, 2024 సంవత్సర క్యాలెండర్లు పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకులు పి.ఎడ్వర్డ్ శనివారం పట్టణంలోని వెంకట్రావుపల్లి, శాంతినగరం గిరిజన కాలనీల్లో చలికాలం దృష్ట్యా దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గంధోత్సవంలో అన్నదానం



దర్గాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు

ఆత్మకూరు: పట్టణంలోని 17వ వార్డు ప్రాంతంలో మహబూబ్ సుభానీ దర్గా వద్ద శనివారం అర్ధరాత్రి గంధమహోత్సవం జరగనున్న నేపథ్యంలో మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు దర్గాలో నిషానీ నిర్వహించారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సయ్యద్ జమీర్, ముజీబ్, చిన్నపరెడ్డి, కొండా చిన్న వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు శివకోటారెడ్డి, కామాక్షయ్యనాయుడు, జి వేణు, తదితరులు పాల్గొన్నారు.

జగనైతేనే సంక్షేమ పథకాలు కొనసాగింపు



సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎంపీపీ, జేసీఎస్ కన్వీనర్



సోమశిల: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కలిగిరి: జిర్రావారిపాళెంలో ప్రచారం నిర్వహిస్తున్న కన్వీనర్ రవీంద్రారెడ్డి



వరికుంటపాడు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఆత్మకూరురూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు 2024లో తిరిగి ముఖ్యమంత్రి అయితేనే కొనసాగుతాయని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర అన్నారు. మండలంలోని నువ్వూరుపాడు సచివాలయం పరిధిలో శనివారం ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరిగి లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. అమ్మఒడి, రైతు భరోసా, ఆసరా, పెన్షన్ కానుక, తదితర పథకాల ద్వారా రూ.3 లక్షల కోట్లకుపైగా నిధులను అర్హులైన పేదలందరికీ అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కటారి దొరసానమ్మ, ఎంపీటీసీ గడ్డం సుచిత్ర, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఈఓఆర్‌డీ ఉషారాణి, ఏఓ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం విజయభాస్కర్ రెడ్డి, ముక్కమళ్ల భాస్కర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజలు సంతృప్తి

సోమశిల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనపై ప్రజలు సర్వత్రా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని సచివాలయ కన్వీనర్ అక్కల రెడ్డి అంకిరెడ్డి అన్నారు. శనివారం అనంతసాగరం సచివాలయం–2 పరిధిలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు, నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పుస్తకాలను లబ్ధిదారులకు అందజేశారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీలను, 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను చదివి వినిపించి ఎవరు ఎన్ని అమలు చేశారో ప్రజలకు వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందితే ప్రజా తీర్పు పుస్తకంలో ఇంటి పెద్ద పేరు, ఫోన్ నంబరు నమోదు చేయాలన్నారు. హామీల అమల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, చంద్రబాబు అమలు చేసిన 10 హామీలను పుస్తకాల్లో మార్పులు పొందపరచడం జరిగిందన్నారు. జగన్ పాలనపై సంతృప్తి చెందితే పుస్తకాలపై స్టాంపు ముద్ర వేయాలని లబ్ధిదారులను కోరారు. ఈ కార్య క్రమంలో నాయకులు బట్రెడ్డి నాగేందర్‌రెడ్డి, గ్రామ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి తెలిపారు. కలిగిరి పంచాయతీ జిర్రావారిపాళెంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు చేరుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలు సజావుగా సాగాలంటే 2024లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బొర్రా మస్తాన్‌రెడ్డి, ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనతో వచ్చిన మార్పును గుర్తించండి

వరికుంటపాడు: గత టీడీపీ పాలనకు, ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఉన్న తేడా, జరిగిన అభివృద్ధిని భేరీజు వేసుకుని రానున్న ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మండలంలోని రామాపురం గ్రామ సచివాలయ పరిధిలోని రామాపురం, హుస్సేన్‌నగర్, వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం జేసీఎస్ కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వర్లు, ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. సచివాలయ కన్వీనర్లు, దారపనేని చెన్నారాయుడు, రాయవరపు మధుసుదనరావు, దుగ్గినేని విజయలక్ష్మి నాయకులు మందలపు తిరుపతినాయుడు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు 600 అబద్దాలు చెప్పి అధికారం చెప్పట్టి రాష్ట్ర ప్రజలను నిట్టనిలువునా ముంచాడన్నారు. ప్రస్తుత సీఎం జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను నెరవేరుస్తే ప్రజామన్ననలు పొందుతున్నారన్నారు. జగనన్న పాలనలో అర్హతే ప్రామాణికంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. అన్నీ వర్గాల వారికి సముచిత న్యాయం చేస్తూ ప్రజాభిమానం చూరగొంటున్నారన్నారు. 2024 ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేడసాని చెన్నకేశవులు, తూర్పుచెన్నంపల్లి సర్పంచ్ యరమల ప్రభాకర్‌రెడ్డి, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సులు లేకుంటే చర్యలు



ఎండీయూ వాహనం వద్ద రేషన్ సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

సంగం: లైసెన్సులు లేకుండా బాణసంచా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు నాగరాజు హెచ్చరించారు. సంగంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఆయన పరిశీలించారు. దుకాణదారులకు పలు సూచనలు చేశారు. అగ్నిమాపకశాఖ అధికారులు విధించిన నియమ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

ఎండీయూ వాహనం తనిఖీ

సంగంలో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాన్ని తహసీల్దారు నాగరాజు శనివారం తనిఖీ చేశారు. లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందజేస్తున్నారా? లేదా అని ప్రశ్నించి సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు.

అటవీశాఖ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న అటవీశాఖ ఉద్యోగులు

కావలి: రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా శనివారం రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 10వ తేదీన గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాస్ స్మరణార్థం ప్రతి అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తారని తెలిపారు. అటవీ అధికారులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా కలప స్మగ్లర్‌తో తీవ్రవాదులతో పోరాటం చేసి, వారు చేసిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన అటవీశాఖ అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి సేవలను గుర్తు చేసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ఉద్యోగులు వై శేషుబాబు, ఆర్.సుమన్, కె.సురేష్, ఐ అనిల్‌కుమార్, కె.పవన్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీలు ప్రారంభం



సాంస్కృతిక పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ మాధవరెడ్డి

కావలి: డాక్టర్ డీఆర్ విశ్వోదయ బాలల దినోత్సవ సాంస్కృతిక పోటీలు డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో జవహర్ భారతి ఎంఎం హాల్లో శనివారం తహసీల్దార్ మాధవరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాను జవహర్ భారతి పూర్వ విద్యార్థి అయినందుకు గర్విస్తున్నానని, విద్యార్థుల్లోని ప్రతిభ, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు, నియోజకవర్గ స్థాయిలో ఇలాంటి పోటీలు నిర్వహించడం చాలా గొప్ప విషయమని, లలిత కళల్లో భాగమైన చిత్రలేఖనం, సంగీతం నృత్యాలు పోటీలు కూడా నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, దొడ్ల మనోహర్‌రెడ్డి, కూనం తాతిరెడ్డి, జ్యోతిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

బాణ సంచా నిర్వీర్యం



బాణా సంచాను నిర్వీర్యం చేస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

ఉదయగిరి: పట్టణంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రూ.2.50 లక్షల విలువైన బాణసంచాను శనివారం నిర్వీర్యం చేశారు. ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని ఆనకట్ట సమీపంలో వీఆర్ క్రాకర్స్ దుకాణంలో జూన్‌లో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారన్నారు. తనిఖీలో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన రూ. 2.50 లక్షల బాణసంచాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఆ బాణసంచాను నిర్వీర్యం చేశామని వివరించారు.

ఆలయంలో ముళ్ల చెట్ల తొలగింపు



ముళ్ల చెట్ల తొలగింపును పర్యవేక్షిస్తున్న ఎంపీపీ

చేజర్ల: చేజర్లలతోని కామాక్షి సమేత నీల కంఠేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం, పరిసరాల్లో ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లను శనివారం తొలగించారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన ఆలయ ప్రాంతంలో ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. ఈ నెల 14న కార్తీక మాసం ప్రారంభం కానుండడంతో దేవాలయాన్ని శుభ్ర పరుస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి పర్యవేక్షించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి

మర్రిపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై విశ్వనాథరెడ్డి హెచ్చరించారు. శనివారం రాత్రి మండలంలోని డీసీపల్లి టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ముగ్గురు వాహనచోదకులు మద్యం తాగి వాహనాలు నడుపుతుండడంతో వారిపై కేసులు నమోదు చేశారు. ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని, దీపావళి పండగ సందర్భంగా వాహనాల్లో బాణసంచా తీసుకెళ్లే వారు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

దీపావళి సందడి ప్రారంభం



ఆత్మకూరులో టపాసుల దుకాణాలు వద్ద పరిశీలించి జాగ్రత్తలు చెబుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: పట్టణంలో దీపావళి పండగ సందడి నెలకొంది. టపాసుల దుకాణాలకు శనివారం అనుమతులు రావడంతో నిర్వాహకులు హడావుడిగా ఏర్పాట్లు చేస్తున్నారు. అగ్నిమాపకశాఖ అధికారులు దుకాణాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భద్రతా కారణాలతో రద్దీగా ఉండే పట్టణానికి దూరంగా నెల్లూరుపాళెం మార్గంలో ఒకే చోట 11 దుకాణాలను ఏర్పాటు చేశారు. ఆత్మకూరుకు చుట్టు పక్కల మండలాలు, గ్రామాల ప్రజలకు అందుబాటులో దుకాణాలు ఏర్పాటు చేయడంతో శనివారం సాయంత్రం నుంచి కొనుగోలుదారులతో సందడి వాతావరణం నెలకొంది. దుకాణాల వద్ద టపాసుల విక్రయాలపై యజమానులకు తగు జాగ్రత్తలు సూచిస్తూ అవగాహన కల్పించారు.

ఆశాజనకంగా నిమ్మ ధరలు

• బస్తా కాయలు రూ.4 వేలు



యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు : ఈ ఏడాది నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఎన్నడూ లేని విధంగా నవంబరు మాసంలోనూ నిమ్మకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. గతేడాది ఇదే సీజల్లో బస్తా కాయలు రూ.1,600 ఉండగా, ప్రస్తుతం నాణ్యతను బట్టి రూ.4 వేలు పలుకుతున్నాయని వ్యాపారులు తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో కాయల దిగుబడి తగ్గడంతో వర్షాకాలంలోనూ రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయని చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో నిమ్మచెట్లు పూత పూయకపోవడంతో వేసవిలోనూ కాయల దిగుబడి తగ్గుతుందని భావిస్తున్నారు. ఇటీవల కురిసిన ఓ మోస్తరు వర్షానికి నిమ్మతోటలు బెట్ట పరిస్థితుల నుంచి కొంత కోలుకున్నాయి. వచ్చే నెల వరకు నీటి అవసరం లేకుండా తోటలను కాపాడుకునేందుకు రైతులకు అవకాశం ఏర్పడింది. మధ్యలో వర్షం కురిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చాలామంది రైతులు నిమ్మ తోటలకు సెప్టెంబరు నుంచి నీటి యాజమాన్య పద్ధతులు పాటించలేదు. తోటలు బెట్టకు వస్తే పూత బాగా పూసి కాయల దిగుబడి పెరుగుతుందనే ఆలోచనతో రైతులు నీటిని కట్టలేదు. వర్షాలు ఆలస్యం కావడంతో కొందరి తోటలు దెబ్బతిన్నట్టుగా తెలుస్తోంది. పూత బాగా వచ్చేందుకు నీటిని తగ్గించాలని సూచించామని, నెలల తరబడి తోటలకు నీటిని పెట్టకుంటే ఇబ్బందులు తలెత్తుతాయని ఉద్యానాధికారులు చెబుతున్నారు.

ఆలయ భూముల కౌలు వేలం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి ఆలయంలో వివిధ ప్రాంతాల్లోని అమ్మవారి భూముల కౌలువేలాన్ని శనివారం నిర్వహించారు. పెనుబల్లిలోని 1.29, కోవూరు మండలం పాటూరులోని 1.50, ఇందుకూరుపేట మండలం పున్నూరులోని 8.65 ఎకరాలకు మూడేళ్ల కాలపరిమితి వేలం నిర్వహించగా రూ.1.32 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ గిరికృష్ణ తెలిపారు. ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యనాయుడు, దేవదాయ శాఖ అధికారులు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి పల్లెకు పోదాం

ఆత్మకూరురూరల్: మండలంలో 'పల్లెకు పోదాం' కార్యక్రమం ఈ నెల 15న నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 15న అప్పారావుపాళెం, 16న వాశిలి, 17న రామస్వామిపల్లి, 20న మురగళ్ల, 21న మహిమలూరు, 22న బోయలచిరివెళ్ల సచివాలయాల పరిధిలో నిర్వహిస్తామని వివరించారు. ఆత్మకూరు ఈఓపీఆర్‌డీ ఉషారాణి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఆయా సచివాలయాల్లో జరిగే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు తప్పక హాజరుకావాలని కోరారు.

14న వాహనం వేలం

చేజర్ల: జిల్లా పోలీసు అధికారులు, ఎస్ఈబీ అధికారుల ఆదేశాలతో చేజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ద్విచక్ర వాహనానికి ఈ నెల 14న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్సై మరిడినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సంగం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు వేలం జరుగుతుందని, హీరో హెచ్ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిల్‌కు సంబంధించి 10 శాతం ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

టపాసుల దుకాణం సీజ్

ఉదయగిరి: పట్టణంలో ఆనకట్ట సమీపంలో వైఎస్సార్ విగ్రహం వద్ద అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న టపాసుల దుకాణాన్ని సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి శనివారం సీజ్ చేశారు. దుకాణంను పరిశీలించి ఎలాంటి అనుమతులు లేవని గుర్తించారు. రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో దుకాణాన్ని సీజ్ చేసి రూ. 1.45 లక్షల విలువైన టపాసులను స్వాధీనం చేసుకున్నారు.

డయల్ యువర్ డీఎం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని డిపో మేనేజరు కరీమున్నీసా నిర్వహించారు. ఆత్మకూరు నుంచి చేజర్లకు అదనపు బస్సు నడపాలని, కలిగిరి, కొండాపురం మీదుగా కందుకూరుకు బస్సు నడపాలని, ఆత్మకూరు నుంచి కడపకు బస్సు నడపాలని కొందరు కోరారు. ఉన్నతాధికారులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని డీఎం వారికి తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కల్పన, డిపో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేద్దాం



ఐక్యతారాగం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

ఆత్మకూరు: త్వరలో తెలంగాణలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ఆంధ్ర ప్రాంత ప్రజలు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేవూరి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. తెలంగాణలోని తెలిసిన మిత్రులు, బంధువులతో చెప్పి పార్టీకి ఓట్లు వేయించేలా కృషి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నం నాగరాజు, మండలాల నాయకులు గంగపట్ల రాంకీ, షేక్ ఖాజారంతుల్లా, కొల్లూరు ప్రసాద్, కంచర్ల హర్ష, ప్రసాద్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో బీటీఏ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మణిసుబ్బు, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా చిన్నయ్య, గౌరవ సలహాదారుడిగా కృపాల్, అసోసియేట్ అధ్యక్షుడిగా అబ్దుల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులు నియమితులయ్యారు. అదనపు ప్రధాన కార్యదర్శిగా ఆనందరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాసులు, కోశాధికారిగా రియాజ్, ఆడిట్ సెక్రటరీగా కృష్ణ, ప్రచార కార్యదర్శిగా కిరణ్‌కుమార్, మహిళా కార్యదర్శిగా భాగ్యమ్మతో పాటు 17 మందిని జిల్లా కార్యవర్గ సభ్యులుగా, 13 మందిని రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎంపిక చేశారు. అనంతరం వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లం వేణుగోపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, బీటీఏ అదనపు రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, పూర్వ జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి రమేష్, రాష్ట్ర కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

వరికుంటపాడు: వరికుంటపాడు శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 56వ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని లైబ్రేరియన్ సునీల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న వారోత్సవాల ప్రారంభ సభ, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులపై ఉపన్యాసాలు, 17న కవి సమ్మేళనాలు, 18న విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, చిత్రలేఖన పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు సభ, బహుమతుల ప్రదానోత్సవం జరుగుతాయన్నారు.

కార్గో డోర్ డెలివరీలో కావలి డిపో ప్రథమ స్థానం

కావలి: ఆర్టీసీ ప్రారంభించిన కార్గో డోర్ డెలివరీ, బుకింగ్‌లో కావలి డిపో ఇప్పటి వరకు జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ ఆర్.శ్రీనివాసులు తెలియజేశారు. శనివారం కావలి కార్గో కేంద్రంలో వారం రోజులుగా కనీసం నాలుగు డోర్ డెలివరీ పార్శిళ్లను బుక్ చేసిన వినియోగదారుల పేర్లు లక్కీ డ్రా తీసి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫర్నీచర్ వ్యాపారి చన్నా వెంకటప్రసాదరావు లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు ఫ్యాన్సీ చీరలను బహుమతులుగా అందజేశారు. పట్టణానికి చెందిన ఎస్ శ్రీనివాసులు, టి రోశయ్య, ఒంగోలు నగరానికి చెందిన ఎం. రవికుమార్ బహుమతులను పొందారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఏవీఆర్ బాబు, మార్కెటింగ్ ఇన్‌చార్జి డి.రవిప్రకాశ్, టీం సభ్యులు షేక్ మస్తాన్, పి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.